క్లుప్తంగా

అత్యవసరమైతేనే బయటకు రావాలి

● ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ సూచన

గచ్చిబౌలి: భారీ వర్షం నేపథ్యంలో ప్రజలు అత్యవసరమైతేనే బయటకు రావాలని ఎమ్మెల్యే గాంధీ సూచించారు. ప్రతి ఒక్కరూ స్వీయ రక్షణ చర్యలు పాటించాలని ఆయన కోరారు. శేరిలింగంపల్లి జంట సర్కిళ్ళ పరిధిలోని పలు కాలనీలు, బస్తీలలో ఆయన జీహెచ్ఎంసీ, జలమండలి, ఇతర శాఖల అధికారులతో కలిసి పర్యటించి వరద పరిస్థితిని పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వర్షాల నేపథ్యంలో మాన్‌సూన్ ఎమర్జెన్సీ టీమ్, డిజాస్టర్ మేనేజ్‌మెంట్ సిబ్బంది, జలమండలి అధికారులు సమన్వయంతో పని చేయాలని ఆయన సూచించారు. అన్ని నాలాలు, వరదనీటి కాలువలు పొంగకుండా రోడ్లపైకి వరదనీరు రాకుండా చూడాలని ఆదేశించారు. కాగా పలుచోట్ల మోకాలిలోతు నీటిలో పర్యటించారు.

గోపీనగర్‌లో కార్పొరేటర్ పర్యటన



కార్పొరేటర్ నాగేందర్‌యాదవ్‌కు సమస్యలు వివరిస్తున్న స్థానికులు

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి గోపీనగర్, నెహ్రూనగర్‌లలో మంగళవారం కార్పొరేటర్ రాగం నాగేందర్‌యాదవ్ పర్యటించారు. స్థానికులు సమస్యలను కార్పొరేటర్ దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా నాగేందర్‌యాదవ్ మాట్లాడుతూ బస్తీల్లో మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. గోపీనగర్‌లో సీసీ రోడ్లు ఇప్పటికే చాలా వరకు పూర్తికాగా, మిగిలిన రోడ్లను కూడా పూర్తయ్యేలా కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో వాటర్ వర్క్స్ మేనేజర్ అభిషేక్ రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు కెఎన్ రాములు, అశోక్, షేక్ గఫార్, రమేష్, ప్రవీణ్, రఫీక్, శశి, ఫక్రుద్దీన్, పాషా, చాంద్, సాయిరాజ్, రవి, రాజు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరం



వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న డిప్యూటీ కమిషనర్ రజనీకాంత్‌రెడ్డి తదితరులు

శేరిలింగంపల్లి: భాగ్యనగర్ మున్సిపల్ జీహెచ్ఎంసీ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో శేరిలింగంపల్లిలో మంగళవారం నిర్వహించిన ఉచిత వైద్యశిబిరానికి విశేష స్పందన లభించింది. టీఎక్స్ హాస్పిటల్ బృందం సహకారంతో నిర్వహించిన ఈ శిబిరాన్ని డిప్యూటీ కమిషనర్ రజనీకాంత్‌రెడ్డి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఉద్యోగులకు, కార్మికులకు ఉచిత వైద్యశిబిరం సౌలభ్యంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో టీఎక్స్ హాస్పిటల్ ఈడీ రవీందర్‌రెడ్డి, చైర్మన్ కార్తీకరెడ్డి, డాక్టర్ దీపక్‌రాజ్, వైద్యులు శరత్‌చంద్ర, మురళీ భరద్వాజ్, బీఎంఎస్ అధ్యక్షులు రాజేశ్వర్‌రావు, వైస్ ప్రెసిడెంట్ కృష్ణ, శేరిలింగంపల్లి జోనల్ ప్రెసిడెంట్ సయ్యద్ ఇక్బాల్, సెక్రటరీ గణేష్, అశోక్‌యాదవ్, స్వరూప్ తదితరులు పాల్గొన్నారు.

సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ అదృశ్యం



భరత్ గెరా (ఫైల్)

గచ్చిబౌలి: ఉద్యోగం పోయిందని మనస్తాపానికి గురైన ఓ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ అదృశ్యమైన సంఘటన రాయదుర్గం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సీఐ మహేష్ తెలిపిన ప్రకారం.. టెలికాంనగర్ ఇయాసిస్ మాన్షన్ అపార్ట్‌మెంట్‌లో నివాసం ఉండే భరత్ గెరా(31) ఈ నెల 4న భార్య స్వాతి శర్మను హఫీజ్‌పేట్‌లోని జెన్‌పాక్ట్ ఆఫీస్ వద్ద దించాడు. సాయంత్రం స్వాతి శర్మ ఇంటికి వచ్చింది. కొద్ది రోజుల క్రితం ఉద్యోగం పోయిందని, ఇంటి నుంచి వెళ్లిపోతున్నానని భరత్ గెరా రాసిన లేఖను చూసింది. ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ చేసి ఉండటంతో సమీప ప్రాంతాలు, తెలిసిన చోట వాకబు చేసినా ఆచూకీ లభ్యం కాలేదు. దీంతో స్వాతి రాయదుర్గం పీఎస్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి



మియాపూర్ : గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైన సంఘటన మియాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్ఐ జగదీష్ తెలిపిన వివరాల ప్రకారం.. మియాపూర్‌లోని ఎక్స్‌రోడ్డు వద్ద ఫుట్‌పాత్‌పై ఓ వ్యక్తి (45- 50) పడి ఉన్నాడని మంగళవారం ఉదయం 8 గంటలకు స్థానికులు మియాపూర్ పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. అప్పటికే ఆ వ్యక్తి మృతిచెందినట్లు గుర్తించారు. ఆరా తీయగా ఏ సమాచారం లభించలేదు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.



సాయిఐశ్వర్య కాలనీలో ..



మదీనాగూడలో ..





మాదాపూర్ ప్రధానరోడ్డుపై ..

భారీ వర్షం.. ఇక్కట్లు

● రోడ్లు జలమయం.. వాహనదారుల పాట్లు
● కాలనీలు, బస్తీలలో నిలిచిన నీరు
● మళ్లీ లింగంపల్లి అండర్‌బ్రిడ్జి వద్ద రాకపోకలు నిలిపివేత..
● ఎమ్మెల్యే, జీహెచ్ఎంసీ అధికారుల పర్యటన

శేరిలింగంపల్లి జోన్‌బృందం: భారీ వర్షంతో జనం అగచాట్లు పడ్డారు. సోమవారం తెల్లవారుజాము నుంచి మంగళవారం ఉదయం వరకు కురిసిన భారీ వర్షానికి రోడ్లపైకి భారీగా వరద నీరు చేరడంతో వాహనదారులు అవస్థలు పడ్డారు. గంట తర్వాత వరదనీరు కాలువల్లోకి వెళ్లిపోవడంతో ఊపిరిపీల్చుకున్నారు.

◆ శేరిలింగంపల్లి జంట సర్కిళ్ళ పరిధిలో రోడ్లు జలమయ్యాయి. ముఖ్యంగా దీప్తిశ్రీనగర్, మాదాపూర్,ఖాజాగూడ, చందానగర్, మదీనాగూడ, మాదాపూర్ మెయిన్ రోడ్డు, బాటా జంక్షన్ హైటెక్‌సిటీ ప్రాంతంలో, అలాగే చందానగర్, లింగంపల్లి ప్రాంతాలలో రోడ్లపై వరద నీరు భారీగా చేరింది. మ్యాన్‌హోళ్ల ద్వారా నాలాలు, వరదనీటి కాలువల్లోకి పారేలా జీహెచ్ఎంసీ సిబ్బంది చర్యలు చేపట్టారు.

◆ మియాపూర్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం రోడ్డులోనూ నీరు నిలిచిపోయింది.

లింగంపల్లి అండర్‌బ్రిడ్జి.. రాకపోకలు నిలిపివేత

◆ భారీ వర్షానికి లింగంపల్లి అండర్‌బ్రిడ్జి వద్ద భారీగా వరదనీరు వచ్చి చేరింది. దీంతో లింగంపల్లి నుంచి గచ్చిబౌలి వైపు రాకపోకలను పూర్తిగా నిలిపివేశారు.

◆ దీంతో వాహనదారులు లింగంపల్లి నుంచి లింగంపల్లి ఆర్‌ఓబీ మీదుగా గచ్చిబౌలి వైపు వెళ్లారు.

◆ జంట సర్కిళ్ల పరిధిలో ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ, జీహెచ్ఎంసీ అధికారులు పర్యటించి పరిస్థితిని సమీక్షించారు.

◆ భవిష్యత్తులో తీసుకోవాల్సిన చర్యలపై అధికారులతో చర్చలు జరిపారు. అందుకు అవసరమైన ప్రతిపాదనలు చేయాలని సూచించారు.

◆ జీహెచ్ఎంసీ వెస్ట్‌జోన్ జోనల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి, డిప్యూటీ కమిషనర్లు వంశీకృష్ణ, రజనీకాంత్‌రెడ్డి, ఆయా సర్కిళ్ల అధికారులు పలు ప్రాంతాల్లో పర్యటించి వరదనీటి మళ్ళింపు చర్యలను పరిశీలించారు.



సాయివైభవ్ కాలనీలో మోకాలిలోతు నీటిలో నిలబడి పరిస్థితిని సమీక్షిస్తున్న జెడ్సీ శ్రీనివాస్‌రెడ్డి, డీసీ రజనీకాంత్‌రెడ్డి, శేరిలింగంపల్లి సర్కిల్ ఇంజనీరింగ్ అధికారులు



లింగంపల్లి రైల్వే స్టేషన్ ఎంఎంటీఎస్ ప్లాట్‌ఫారమ్ వైపు వెళ్లే రోడ్డులో..



లింగంపల్లి అండర్‌బ్రిడ్జి వద్ద భారీగా వరదనీరు రావడంతో వాహనాలను దారి మళ్లిస్తున్న దృశ్యం



లింగంపల్లి అండర్‌బ్రిడ్జి ఎదురుగా ఉన్న అపార్ట్‌మెంట్ సెల్లార్ నీటితో నిండిన దృశ్యం



గచ్చిబౌలి డివిజన్ సాయిఐశ్వర్యకాలనీలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే గాంధీ



దీప్తిశ్రీనగర్ ప్రధాన రోడ్డుపై..



గచ్చిబౌలిలో..



మదీనాగూడలో వరదనీటి తొలగింపు చర్యలు



దీప్తిశ్రీనగర్ కాలనీలో ..



చందానగర్ సర్కిల్ పరిధిలో వరద ప్రాంతాలను పరిశీలిస్తున్న డీసీ వంశీకృష్ణ, ఇతర అధికారులు

పటేల్ చెరువుకు గండి

● చెరువు కింద కాలనీలు జలమయం
● పరిశీలించిన ఎమ్మెల్యే గాంధీ, కమిషనర్ రోనాల్డ్‌రాస్

మియాపూర్ : భారీ వర్షానికి మియాపూర్ పటేల్ చెరువుకు గండిపడింది. దీంతో వరదనీరంతా ఒక్కసారిగా చెరువు క్రింది భాగంలో ఉన్న శ్రీరాంనగర్, శాంతినగర్, దీప్తిశ్రీనగర్ కాలనీల్లోకి చేరింది. రోడ్లన్నీ వరదనీటితో నిండిపోవడంతో కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. పటేల్ చెరువు కట్టకు గండి పడిన విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే గాంధీ, జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్‌రాస్, జోనల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి, డీసీ వంశీ కృష్ణలతో కలిసి ఆయన పరిశీలించారు. చెరువుకట్టను పూడ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ మాట్లాడుతూ చెరువుకట్టను పటిష్టం చేయాలని అధికారులకు సూచించారు.ఆయన వెంట కార్పొరేటర్లు ఉప్పలపాటి శ్రీకాంత్, మంజుల రఘునాథ్‌రెడ్డి, అధికారులు ఈఈ శ్రీకాంతిని, డీఈ దుర్గాప్రసాద్, ఏఈ సంతోష్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.





పటేల్‌చెరువు గండిపడడంతో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద వరదనీరు

వర్షాలకు అతలాకుతలం..

● రూ.8వేల కోట్ల అభివృద్ధి ఇదేనా...?
● బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు రవికుమార్‌యాదవ్

గచ్చిబౌలి: భారీ వర్షానికి శేరిలింగంపల్లి అతలాకుతలమైందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రవికుమార్‌యాదవ్ విమర్శించారు. శేరిలింగంపల్లి జంట సర్కిళ్ళ పరిధిలో వరదనీటిలో నిండిన పలు కాలనీలు ,బస్తీలలో ఆయన మంగళవారం పర్యటించి పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ రూ.8వేల కోట్లతో అభివృద్ధి చేశామని గొప్పలు చెప్పుకునే నాయకులు అభివృద్ధి ఎక్కడో చెప్పాలన్నారు. ఏళ్ల తరబడి నాలాల విస్తరణ పూర్తి కాకపోవడం అధికారులు, ప్రజాప్రతినిధుల చిత్తశుద్ధికి నిదర్శనమన్నారు. ఎక్కడ చూసినా మునిగిపోయిన రోడ్లు, ఇళ్లలోకి వరద నీరు పరిపాటిగా మారిందన్నారు. ఇంత జరుగుతున్నా తొమ్మిదేళ్లలో ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు.



శేరిలింగంపల్లి బస్తీలో మురుగు నీటిని పరిశీలిస్తున్న రవికుమార్

నేడు దవిన్సీ ఎక్స్ మెషీన్ ప్రారంభం

మాదాపూర్: మాదాపూర్‌లోని మెడికవర్ హాస్పిటల్‌లో దేశంలోనే మొదటిసారిగా ఏర్పాటు చేసిన రోబోటిక్ 4వ జనరేషన్ దవిన్సీ ఎక్స్ మెషీన్‌ను బుధవారం శ్రీశ్రీశ్రీ త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన్నజియర్ స్వామీజీ ఉదయం 11గంటలకు ప్రారంభించనున్నారు. ఈ యంత్రం ద్వారా తక్కువ రిస్క్, ఇన్‌ఫెక్షన్, తక్కువ నొప్పి తో సర్జరీలను చేయవచ్చని తెలిపారు.

వ్యసనాలకు బానిస కావొద్దు

రిటైర్డ్ ఐపీఎస్ ఆఫీసర్ గంగాధర్

గచ్చిబౌలి: వ్యసనాలకు బానిస కావొద్దని రిటైర్డ్ ఐపీఎస్ ఆఫీసర్ గంగాధర్ విద్యార్థులకు సూచించారు. మంగళవారం కొండాపూర్‌లోని సంస్కృతి హైస్కూల్‌లో జరిగిన టీచర్స్‌డేకు ఆయన హాజరై మాట్లాడుతూ అక్షరాస్యత పెరిగినా క్రైం రేట్ కూడా పెరుగుతుందన్నారు. నేరాలపై అవగాహన లేకపోవడంతోనే చాలా మంది అమాయకులు మోసపోతున్నారన్నారు. డ్రగ్స్, దురలవాట్లకు బానిసలై భవిష్యత్‌ను పాడుచేసుకోవద్దని సూచించారు. ఉన్నత లక్ష్యాలతో శ్రమించి చదవాలని, తల్లిదండ్రుల కలలను నిజం చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో సంస్కృతి హైస్కూల్ చైర్మన్ మంగళారపు లక్ష్మణ్, డైరెక్టర్లు భవాని, భార్గవి, ప్రిన్సిపల్ జ్యోతిర్మయి తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న రిటైర్డ్ ఐపీఎస్ ఆఫీసర్ గంగాధర్

ఘనంగా టీచర్స్ డే

క్వాలిటీ థాట్ టెక్నాలజీస్ ఆధ్వర్యంలో మంగళవారం ఉపాధ్యాయ దినోత్సవ వేడుకల్ని ఘనంగా నిర్వహించారు. మాదాపూర్ అయ్యప్ప సొసైటీలోని కంపెనీ కార్యాలయంలో జరిగిన వేడుకల్లో పద్మశ్రీ అవార్డు గ్రహీత హనుమాన్ చౌదరి, ఎంజీఎస్సీఆర్ఈ చైర్మన్ ప్రసన్న కుమార్, పి.వి ఫౌండేషన్ చైర్మన్ పి.వి ప్రభాకర్ రావు, డాక్టర్ త్రివిక్రమ్, ప్రొఫెసర్ రామచంద్ర ఆర్యశ్రీ, క్వాలిటీ థాట్ తరఫున రమణ భూపతి తదితరులు పాల్గొన్నారు.

– సాక్షి, సిటీబ్యూరో



సమాజంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకం

రాయదుర్గం: సమాజంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో విశిష్టమైనదని తెలంగాణ స్టేట్ సెంటర్ ఇన్‌స్టిట్యూషన్ ఆఫ్ ఇంజనీర్స్(ఇండియా) చైర్మన్ బ్రహ్మారెడ్డి పేర్కొన్నారు. మంగళవారం గచ్చిబౌలిలోని ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియాలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఎస్కీలోని చాణక్య సెమినార్ హాల్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా 'ఎస్కీ'డైరెక్టర్ డాక్టర్ రామేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో మాజీ రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం 'విద్య పునరుద్ధరణలో ఉపాధ్యాయులు' అనే అంశంపై ప్రత్యేక ఉపన్యాస కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంజనీరింగ్ ల్యాండ్ స్కేప్‌ను రూపొందించడంలో అధ్యాపకుల పాత్ర కీలకంగా ఉంటుందన్నారు. ఎస్కీ డైరెక్టర్ డాక్టర్ రామేశ్వరరావు మాట్లాడారు. అనంతరం ఎస్కీ అధ్యాపకులను సత్కరించారు. కార్యక్రమంలో అతిథులంతా కలిసి ఎస్కీ ఏపీ, ఎఫ్ఏ చీఫ్ లక్ష్మీకాంతరావు, సెంటర్ ఫర్ క్లైమెట్ ఛేంజ్ అండ్ ఎన్విరాన్‌మెంట్ మేనేజ్‌మెంట్ విభాగం సలహాదారు ప్రొఫెసర్ వెంకట్‌రెడ్డి, సీనియర్ ఫ్యాకల్టీ కెజె అమర్‌నాథ్‌లను ఘనంగా సత్కరించారు.

విద్యార్థులు లోతుగా అధ్యయనం చేయాలి

విద్య అనేది ఆలోచించడం, సంస్కరించడం, అభినందించడానికి ఒక మార్గమని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్శిటీ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ బీజేరావు పేర్కొన్నారు. మంగళవారం ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని మనూలో స్కూల్ ఆఫ్ ఎడ్యుకేషన్ అండ్ ట్రెనింగ్ ఆధ్వర్యంలో అందరికీ విద్య అనే అంశంపై ప్రత్యేక ఉపన్యాస కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్య కేవలం డిగ్రీ పొందడం, నైపుణ్యాలు సంపాదించడం, ఉద్యోగాలు పొందడం కోసం సాధనం కాదన్నారు. విద్యార్థులు లోతుగా అధ్యయనం చేయాలని తద్వారా వారు నిష్ణాతులుగా మారతారన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న ఎస్కీ డైరెక్టర్ రామేశ్వర్‌రావు, బ్రహ్మారెడ్డి తదితరులు

సుమన్ కళాశాలలో..

హఫీజ్‌పేట్ : ఉపాధ్యాయ దినోత్సవంను పురస్కరించుకొని చందానగర్ గంగారంలోని మహిళా దక్షత సమితి విద్యాసంస్థలు సుమన్ బాలికల జూనియల్ కళాశాలలో మంగళవారం వేడుకలు నిర్వహించారు. ముఖ్య అతిథులుగా వీ.డి. బజాజ్, బన్సీలాల్ మలానిలు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఉత్తమ ఉపాధ్యాయులకు అవార్డులు అందజేశారు. ప్రిన్సిపల్ రమాకుమారి, సుశీల పాటిల్, అధ్యాపకులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి ఉత్తమ ప్రిన్సిపాల్‌గా పాపారావు

ఘనంగా సత్కరించిన మంత్రులు, అధికారులు

రాయదుర్గం: రాష్ట్రస్థాయి ఉత్తమ ప్రిన్సిపాల్‌గా గౌలిదొడ్డి సాంఘిక సంక్షేమ గురుకుల బాలుర కళాశాల ప్రిన్సిపల్ వట్టికొండ పాపారావు ఎంపికయ్యారు. మంగళవారం రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో రవీంద్రభారతిలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో మంత్రులు సబితారెడ్డి, మహమూద్‌అలీ , విద్యాశాఖ అధికారులు ఘనంగా సత్కరించారు.

జిల్లాస్థాయిలో అశోక్‌కుమార్..

రంగారెడ్డిజిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయుడిగా రాయదుర్గం నాగార్జున ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు జి అశోక్‌కుమార్‌ను ఘనంగా సత్కరించారు. జిల్లా పరిషత్ కార్యాలయంలో అశోక్‌కుమార్‌ను మంత్రి సబితారెడ్డి, జెడ్పీచైర్మన్ అనితారెడ్డితో పాటు అధికారులు, ప్రజాప్రతినిధులు ఘనంగా సత్కరించారు.



రవీంద్రభారతిలో ప్రిన్సిపాల్ పాపారావును సత్కరిస్తున్న మంత్రులు సబితారెడ్డి, మహమూద్‌అలీ

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి,
వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు
మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9912225455
9912225462